సాక్షి
అనంతపురం

గురువారం । 24 । జూలై । 2025



చీనీ టన్ను రూ.17,100

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.17,100 పలికాయి.



టమాట కిలో రూ.34

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టం రూ.34, కనిష్టం రూ.20, సరాసరి రూ.26 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.


గరిష్టం/కనిష్టం

30.3°/21.6°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

కృష్ణా జలాల పంపింగ్ ప్రారంభం



రాగులపాడు వద్ద 8వ లిఫ్ట్ నుంచి కృష్ణా జలాలను పంపింగ్ చేస్తున్న దృశ్యం

వజ్రకరూర్/ఉరవకొండ: వజ్రకరూరు మండలంలోని రాగులపాడు హంద్రీ–నీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం పంప్ హౌస్ నుంచి కృష్ణా జలాల పంపింగ్ ప్రారంభమైంది. బుధవారం అధికారులు ప్రత్యేక పూజలు చేసి 8వ లిఫ్ట్ నుంచి పంపింగ్ ప్రారంభించారు. 2 పంపుల ద్వారా ప్రస్తుతం 700 క్యూసెక్కుల నీటిని జీడిపల్లి రిజర్వాయర్‌కు విడుదల చేశారు. హంద్రీ–నీవా కాలువ గట్టు పరిస్థితిని అంచనా వేసేందుకు తక్కువ నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. విడతల వారీగా నీటి పంపింగ్ పెంచుతామని హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ డీఈ సీవీ రమణ, ఏఈ సురేష్‌నాయక్ చెప్పారు.

పోలీసు బందోబస్తు నడుమ సోలార్ టవర్ పనులు



బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి

యాడికి: భారీ పోలీసు బందోబస్తు నడుమ సోలార్ టవర్ పనులు చేపడుతున్నారు. వారం క్రితం మండలంలో రాయలచెరువు మోడల్ స్కూల్ సమీపంలోని ప్రధాన రహదారి పక్కన సోలార్ టవర్ నిర్మాణ పనులను తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి తన అనుచరులతో అడ్డుకోవడానికి యత్నించారు. ఈ క్రమంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి ఆ ప్రాంతంలో పోలీసులను మోహరించారు. స్పెషల్ పార్టీ పోలీసులతో పాటు యాడికి, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు మండలాలకు చెందిన సుమారు 100 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం నుంచి సోలార్ టవర్ వద్ద జాతీయ రహదారిపై పోలీసులు పహారా కాశారు. జేసీ అనుచరులు అడ్డుకుంటారేమోనన్న అనుమానంతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో సీఐ ఈరన్న, ఎస్‌ఐ రమణయ్య పోలీసులు పాల్గొన్నారు.

పోలీసుశాఖ ప్రతిష్ట పెంచాలి

అనంతపురం: నిష్పక్షపాతంగా,పారదర్శకంగా విధులు నిర్వర్తించి పోలీసు శాఖ ప్రతిష్ట పెంచాలని ఎస్పీ పి. జగదీష్ పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని తన చాంబర్‌లో బుధవారం ప్రొబేషనరీ ఎస్‌ఐలతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. సామాజిక బాధ్యతగా సమస్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వివిధ అంశాలపై పట్టు పెంచుకోవాలని సూచించారు. కాగా, జిల్లాకు 17 మంది ప్రొబేషనరీ సబ్ ఇన్‌స్పెక్టర్లను కేటాయించారు. ఐదు నెలల పాటు ప్రొబేషనరీ ఎస్‌ఐలు విధులు నిర్వర్తించనున్నారు.

లక్షలాది మంది జీవనాడి.. తాగు,సాగునీటి అవసరాలను తీర్చే వరప్రదాయిని అయిన జీబీసీని గత టీడీపీ హయాంలో 'పచ్చ' కాంట్రాక్టర్లు కాసులు కొల్లగొట్టే కల్పతరువుగా మార్చుకున్నారు. నిధులు జేబుల్లో వేసుకునేందుకు ఆధునికీకరణ పనులు ఇష్టారాజ్యంగా చేపట్టారు. వారి పాపాలు నేటికీ రైతులను వెంటాడుతున్నాయి.

నిధులు మింగి.. కన్నీరు మిగిల్చి



జీబీసీ 50వ కిలోమీటరు వద్ద ధ్వంసమైన కాలువ సైడ్ వాల్స్

'పచ్చ' నేతల పాపం.. రైతులకు శాపం

- గత టీడీపీ హయాంలో ఇష్టారాజ్యంగా జీబీసీ ఆధునికీకరణ పనులు
- కొన్నాళ్లకే దెబ్బతిన్న షట్టర్లు, సైడ్‌వాల్స్
- నేటికీ నీటి ప్రవాహానికి అడ్డంకులు
- చివరి ఆయకట్టుకు అందని నీరు

ఉరవకొండ/విడపనకల్లు: గుంతకల్లు బ్రాంచ్ కాలువ (జీబీసీ) ఆధునీకీకరణకు గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో (2016–17) రూ.293 కోట్లు కేటాయించారు. ఉరవకొండ మండలం నింబగల్లు సమీపంలోని జీబీసీ హెడ్ రెగ్యులేటరీ జీరో కిలోమీటరు నుంచి దాదాపు 60 కిలోమీటర్ల మేర పనులు చేపట్టారు. ప్రస్తుత కళ్యాణదుర్గం టీడీపీ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబుకు చెందిన ఎస్‌ఆర్‌సీతో పాటు చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు,ఎంపీ సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ కన్‌స్ట్రక్షన్ సంస్థ ఆధ్వర్యంలో పనులు జరిగాయి. ఒకటో కిలోమీటరు నుంచి 28 కిలోమీటరు వరకు ఎస్‌ఆర్‌సీ, 28 కిలోమీటరు నుంచి 60 కిలోమీటరు వరకు రిత్విక్ సంస్థ పనులు చేపట్టాయి. ఇందులో ఎస్‌ఆర్‌సీ ఏమాత్రమూ నాణ్యత ప్రమాణాలు పట్టించుకోకుండా పనులు తూతూమంత్రంగా ముగించింది. అది కూడా 80 శాతం పనులే చేశారు. ఇక.. సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ సంస్థ 20 శాతం కూడా పనులు చేయకుండానే చేతులెత్తేసింది. బిల్లులు మాత్రం అందిన కాడికి స్వాహా చేశారు. వీరి కాసుల కక్కుర్తి ఫలితంగా ఐదేళ్ల తిరక్కముందే సైడ్ వాల్, డిస్ట్రిబ్యూటరీలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అక్విడక్టులు, అండర్ టన్నెళ్లు, మోరీలు అనతికాలంలోనే శిథిలావస్థకు చేరాయి. పెచ్చులు, రాళ్లు ఊడి కాలువలో పడిపోయాయి. కాలువ కోతకు గురైంది. జీబీసీ సామర్థ్యానికి తగ్గట్లు నీటిని తీసుకోవాలని చేపట్టిన ఆధునికీకరణ ఉద్దేశం కొందరి స్వార్థం కారణంగా నెరవేరకపోవడంతో మళ్లీ పాత కథే పునరావృతమైంది. 640 క్యూసెక్కుల నీరు పారాల్సి ఉన్నా.. కాలువ దుస్థితిని దృష్టిలో ఉంచుకుని కేవలం 250 క్యూసెక్కుల నీటితో సరిపెడుతుండడం గమనార్హం.

అడుగడుగునా అడ్డంకులే..

హెచ్చెల్సీ ద్వారా వచ్చే తుంగభద్ర జలాలను త్వరలో జీబీసీకి మళ్లించనున్నారు. ఈ క్రమంలో అప్పట్లో 'పచ్చ' నేతల పాపాలు నేటికీ నీటి ప్రవాహానికి అడుగడుగునా అడ్డంకులు సృష్టించనున్నాయి. కాలువలో పిచ్చిమొక్కలు పెరిగి ముళ్లకంపలు చేరడం మరింత ఇబ్బందిగా మారింది. దీనికితోడు నీళ్లు విడుదలైన ప్రతి సారీ బ్రిడ్జిలు తెగిపోవడం, నీటిని 10 రోజులు బంద్ చేయడం కారణంగా చివరి ఆయకట్టు రైతులకు చుక్క నీరు అందడం లేదు.

ప్రతిపాదనలు పంపుతాం

జీబీసీలో 58 అక్విడక్ట్‌లు, అండర్ బ్రిడ్జిలు శిథిలమయ్యాయి. వాటి స్థానంలో కొత్తవి నిర్మించాల్సి ఉంది. ప్రధాన కాలువ సైడ్‌వాల్స్ కూడా ధ్వంసమయ్యాయి. మరమ్మతులకు రూ. 250 కోట్లు కావాల్సి ఉంది. ఇందుకోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం.

– వెంకటరమణ, ఈఈ, జీబీసీ



హంచనహాల్ వద్ద జీబీసీలో నీటి ప్రవాహానికి అడ్డంగా పడిన రాళ్లు

జీబీసీ ఆయకట్టు వివరాలు (ఎకరాల్లో)	
గుంతకల్లు బ్రాంచ్ కెనాల్	15,800
గుత్తి సబ్ బ్రాంచ్ కెనాల్	16,271
ఆలూరు బ్రాంచ్ కెనాల్	14,257
జీబీసీ ప్రధాన కాలువ పొడవు	60 కిలోమీటర్లు
కాలువ నీటి సామర్థ్యం	640 క్యూసెక్కులు
అండర్ టన్నెల్స్, అక్విడక్ట్స్, బ్రిడ్జిలు	58



విడపనకల్లు మండలం కరకముక్కల వద్ద షట్టర్లు లేని ప్రధాన కాలువ

గూగూడులో 'హుండీ మాయం'!

- ఈఓకు టీడీపీ నాయకులు వత్తాసు పలకడంపై సర్వత్రా అనుమానాలు



ఈఓ సమక్షంలోనే విలేకర్లపై దౌర్జన్యం చేస్తున్న టీడీపీ నాయకులు

నార్పల: మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గూగూడులో హుండీ మాయమైన ఘటన కలకలం రేపింది. గూగూడు కుళ్లాయిస్వామి మొహర్రం ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో తాత్కాలికంగా నాలుగు హుండీలు ఏర్పాటు చేశారు. ఈ నెల 18న వాటిలో మూడింటిని తెరిచి కానుకలను లెక్కించారు. తర్వాత ఆ హుండీలను ఓ ట్రాక్టర్‌లో తీసుకెళ్లారు. ఈ క్రమంలో లెక్కించని నాలుగో హుండీని కూడా తరలించినట్లు తెలిసింది. గూగూడు గ్రామస్తుల నుంచి కూడా దీనిపై ఆరోపణలు వచ్చాయి.ఇదే క్రమంలో ట్రాక్టర్‌లో హుండీలను తరలిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరలైంది.

ఈఓకు టీడీపీ నాయకుల వత్తాసు..

'హుండీ మాయం' ఘటనపై బుధవారం దేవదాయ శాఖ ఈఓ శోభారాణి గూగూడులో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకర్లు సీసీ కెమెరా ఫుటేజీ చూపాలని, దీంతో అనుమానాలన్నీ తొలగిపోతాయని ఈఓను కోరగా.. పొంతనలేని సమాధానాలిచ్చారు. ఈ క్రమంలోనే ఆమె వెంటే ఉన్న టీడీపీ నేతలు దౌర్జన్యానికి దిగారు. విలేకర్లపై దురుసుగా ప్రవర్తించారు. ఈఓకు టీడీపీ నేతలు వత్తాసు పలకడం సర్వత్రా అనుమానాలకు తావిచ్చింది. టీడీపీ నేతలను ఎందుకు వెంట తెచ్చుకున్నారని ఈఓను ప్రశ్నిస్తే.. వారు అనధికారిక కమిటీ మెంబర్లంటూ ఆమె చెప్పడం గమనార్హం.ఏదిఏమైనా రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందిన గూగూడు ఆలయంలో హుండీ మాయమైన ఘటన గ్రామస్తులు, భక్తుల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు చొరవ తీసుకొని ఈ విషయంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సీసీ ఫుటేజీని బయటకు తీయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

యథేచ్ఛగా జీరో బిజినెస్

- రూ.50 వేలు దాటితే వే బిల్లు ఉండాలనే నిబంధన బేఖాతరు
- పది లక్షల సరుకైనా 48 వేలకే చూపించి పన్ను ఎగవేత
- ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి
- ఫిర్యాదుల్లేకుండా తనిఖీలు చేయలేమంటున్న జీఎస్టీ అధికారులు
- కొన్ని సర్కిళ్లలో అధికారులు.. వ్యాపారుల కుమ్మక్కు!



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో జీరో బిజినెస్ మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. దీంతో ఏటా ప్రభుత్వ ఖజానాకు కోట్ల రూపాయలు గండి పడుతోంది. పన్నుల రూపంలో రావాల్సిన ఆదాయం అక్రమార్కుల జేబుల్లోకి చేరుతోంది. ఇక్కడి నుంచి వెళ్లే, ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలోకి వచ్చే సరుకుకు వే బిల్లులే ఉండటం లేదు. ఈ క్రమంలో ప్రభుత్వానికి పైసా ఆదాయం రావడం లేదు. జీఎస్టీ అధికారులకు ఇదంతా తెలిసే జరుగుతున్నా నిస్సహాయ స్థితిలో ఉంటున్నారు. జీరో బిజినెస్ కారణంగా ఏడాదికి రూ.100 కోట్లకు పైగా ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోందని అధికారుల అంచనా.

రకరకాల మార్గాల్లో సరుకు..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రధాన ఆదాయ సర్కిళ్లు అనంతపురం, హిందూపురం, తాడిపత్రి, గుంతకల్లు. అయితే, ఆయా ప్రాంతాలకు సరుకు ఎప్పుడొస్తుందో, ఎప్పుడు షాపులకు చేరిపోతుందో అంతుచిక్కని పరిస్థితి. ముఖ్యంగా గ్రానైట్, టైల్స్, సిరామిక్ వంటి సరుకు జీఎస్టీ అధికారులకు తెలియకుండానే అర్ధరాత్రి చేరిపోతోంది. చెక్‌పోస్టుల్లో చెల్లించడం మినహా జీఎస్టీ చెల్లించిన దాఖలాలు లేవు. అర్ధరాత్రి జిల్లాలోకి పదుల సంఖ్యలో లారీలు ప్రవేశిస్తున్నాయి. కొన్ని చోట్ల వ్యాపారులు, జీఎస్టీ అధికారులు కుమ్మక్కవుతున్నారు.

ఎంత సరుకు ఉన్నా రూ.48 వేలే..

ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి హైదరాబాద్, చెన్నై, బెంగళూరు ప్రాంతాలకు రోజూ వందల ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు వెళ్తుంటాయి.. వస్తుంటాయి. ఇందులో ప్యాసింజర్ల కంటే సరుకు రవాణా ఎక్కువ. సాధారణంగా సరుకు విలువ రూ.50 వేల కంటే ఎక్కువ ఉంటే వే బిల్లు విధిగా ఉండాలి. ఉదాహరణకు 30 సెల్‌ఫోన్‌లు కొంటే రూ.3 లక్షలు. కానీ నాలుగు పేర్లమీద బిల్లు వేసి తెస్తారు. రూ. 5 లక్షల సరుకైనా రూ.49 వేల లోపు విలువ చూపించి ఇన్‌వాయిస్‌తో మాత్రమే సరిపెడుతున్నారు. దీంతో రోజూ బస్సుల ద్వారా కోట్ల రూపాయల విలువైన సరుకు జిల్లాకు ఎలాంటి పన్నులూ లేకుండా చేరిపోతోంది.

మార్కెట్‌లో బిల్లులు లేవు..

అనంతపురం, పుట్టపర్తి, హిందూపురం, కదిరి, తాడిపత్రి వంటి పట్టణాల్లో బిల్లులు లేని బిజినెస్సే ఎక్కువ. ఉదాహరణకు అనంతపురంలోని కమలానగర్‌లో ఏ ఒక్క షాపులోనూ కంప్యూటర్ జనరేటెడ్ బిల్లు ఉండదు. మొత్తం చేతిరాతతో ఉండే చిట్టీల పైనే బిల్లులు ఉంటున్నాయి. ఇంత పెద్ద మొత్తంలో జీరో దందా నడుస్తున్నా అడిగే నాథుడే లేరు. వ్యాపారులు కూడా ఈ దందా కొన్నేళ్లుగా కొనసాగిస్తూనే ఉన్నారు. జీఎస్టీ అధికారులను అడిగితే.. తమకు రాష్ట్రస్థాయిలో అధికారులు ఆదేశిస్తేనే వారిపై దాడులు చేస్తామని, లేదంటే చేయలేమని చెబుతున్నారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పరిస్థితి ఇలా	
మొత్తం జీఎస్టీ సర్కిళ్లు	07
ఈ ఏడాది పన్నుల రూపంలో వచ్చిన మొత్తం	రూ.381 కోట్లు
జీరో బిజినెస్ కట్టడితో వచ్చే మొత్తం సొమ్ము	రూ.500 కోట్ల పైనే
ఏటా జీరో బిజినెస్ ద్వారా కోల్పోయే మొత్తం	రూ.120 కోట్ల వరకూ

జాయింట్ ఎల్‌పీఎంల సబ్ డివిజన్ డ్రైవ్

- డిసెంబరు 31 వరకు ప్రక్రియ
- రైతులకు సమాచారం చేరవేయండి
- అధికారులకు ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆదేశం

అనంతపురం అర్బన్: 'భూములు రీ–సర్వే జరిగిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎంలకు సంబంధించి ప్రత్యేక సబ్ డివిజన్ డ్రైవ్‌ను ఈ ఏడాది డిసెంబరు 31 వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ఉత్తర్వులను బుధవారం జారీ చేసింది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకునేలా సమాచారం చేరవేయండి' అని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ అన్నారు. బుధవారం కలెక్టరేట్ నుంచి డివిజన్, మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాయింట్ పట్టాదారులుగా నమోదైన రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడంలో నెలకొన్న ఇబ్బందులు తొలగించేందుకు ప్రత్యేక సబ్ డివిజన్ డ్రైవ్ చేపట్టామన్నారు. రెవెన్యూ శాఖ సబ్ డివిజన్ సేవకు నిర్ధారించిన రుసుం రూ.550లో రూ.500 మినహాయింపు ఇచ్చారన్నారు. నామమాత్రంగా దరఖాస్తు రుసుం రూ.50 సంబంధిత గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ వద్ద చెల్లించాలన్నారు. తదుపరి జాయింట్ పట్టాదారులకు ఉచితంగా సబ్‌డివిజన్ చేస్తారన్నారు. డిసెంబరు 31లోపు దరఖాస్తు చేసుకున్నవారికే అవకాశం ఉంటుందన్నారు. రైతులకు ఈ విషయాన్ని తెలియజేసి సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్

25లోపు చౌక దుకాణాలకు రేషన్ చేరాలి

చౌక ధరల దుకాణాలకు బియ్యం, నిత్యావసర సరుకులు ఈనెల 25వ తేదీలోగా చేర్చాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆదేశించారు. 26వ తేదీ నుంచి సరుకుల పంపిణీ ప్రారంభించాలని చెప్పారు. చౌక ధరల దుకాణాలకు బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు ఇప్పటి వరకు 37 శాతం మాత్రమే చేరాయన్నారు. 26వ తేదీ నుంచి వృద్ధులు, దివ్యాంగులు,నిస్సహాయుల ఇళ్ల వద్దకే డీలర్లు వెళ్లి రేషన్ పంపిణీ చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో సీఎస్‌డీటీలు, తహసీల్దారు పర్యటిస్తూ చౌక దుకాణాలను తనిఖీ చేయాలన్నారు. పీ4పై ప్రత్యేక దృష్టి సారించి మార్గదర్శకులను గుర్తించాలన్నారు. జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ, భూముల కేటాయింపు ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డీఆర్‌ఓ ఎ.మలోల, సర్వే శాఖ ఏడీ రూప్లానాయక్, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, కో–ఆర్డినేషన్ సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి, భూ విభాగం సూపరింటెండెంట్ రియాజుద్దీన్, డీటీ సురేఖరావు, తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజులిక్కడ.. మూడు రోజులు అక్కడ

- తాత్కాలికంగా సమగ్రశిక్ష కార్యక్రమాల పర్యవేక్షణకు నలుగురు టీచర్లు
- సెక్టోరియల్ పోస్టుల భర్తీని పట్టించుకోని అధికారులు

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష కార్యాలయంలో పరిపాలనా అవసరాల కోసం నలుగురు టీచర్లను తాత్కాలికంగా తీసుకున్నారు.బొమ్మనహాళ్ మండలం సింగనహళ్లి జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం ఎల్.ప్రహ్లాదనాయుడు, రాయదుర్గంలో హెచ్‌ఎంగా పని చేస్తున్న నారాయణస్వామి, బ్రహ్మసముద్రంలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న చలపతినాయుడు, పెద్దపప్పూరు మండలం వరదాయపల్లిలో ఎస్టీటీగా పని చేస్తున్న ఆంజనేయులును తాత్కాలికంగా నియమిస్తూ సమగ్ర శిక్ష డీపీసీ, డీఈఓ ప్రసాద్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగా నియమితులైన వారు వారంలో మూడు రోజులు ఇక్కడ, మిగిలిన మూడు రోజులు పాఠశాలకు వెళ్లాల్సి ఉంటుంది. కీలకమైన సెక్టోరియల్ అధికారుల పోస్టుల భర్తీ ప్రక్రియను పక్కన పెట్టేసి తాత్కాలికంగా టీచర్లను తీసుకోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికే ఏడాదిగా విద్యాభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించే సెక్టోరియల్ అధికారులు లేక 'సమగ్రశిక్ష' నిర్వీర్యమైంది. గతేడాది జూలై 31న ఉన్న సెక్టోరియల్ అధికారులందరినీ ఒకేమారు తప్పించారు. సెక్టోరియల్స్‌ను తప్పించాలన్నా... కొత్తగా తీసుకోవాలన్నా వేసవి సెలవుల్లో మాత్రమే చేపట్టాలనే విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులను తుంగలో తొక్కి మధ్యలోనే తప్పించడం గమనార్హం.

నోటిఫికేషన్‌కు మంగళమేనా?

'సెక్టోరియల్' పోస్టుల భర్తీకి గతంలో ఓసారి నోటిఫికేషన్ విడుదల చేశారు. దరఖాస్తులు స్వీకరించి స్క్రూటినీ చేశారు. ఇంటర్వ్యూల అనంతరం ఐదుగురిని ఎంపిక చేసి జాబితాను ఆమోదం కోసం ఎస్పీడీ ద్వారా విద్యాశాఖ కమిషనర్ కార్యాలయానికి పంపారు. అక్కడి నుంచి నలుగురికి మాత్రమే ఆమోదం దక్కింది. అయితే, తాము చెప్పిన వారి పేర్లు లేవనే కారణంగా కొందరు ప్రజాప్రతినిధులు అధికారులపై తీవ్ర ఒత్తిళ్లు చేసి ఆ పోస్టింగ్‌లను అడ్డుకున్నారు. చివరకు ఒక టీచరు నాట్ విల్లింగ్ ఇవ్వడం, మరొక టీచరు హెచ్‌ఎంగా పదోన్నతి రావడంతో వెళ్లిపోయారు. ఎట్టకేలకు కలెక్టర్ ఆదేశాలతో తక్కిన ఇద్దరిని మాత్రం తీసుకున్నారు. గత నెలలో ఆరు సెక్టోరియల్ పోస్టుల భర్తీకి మరో నోటిఫికేషన్ జారీ చేశారు. టీచర్ల నుంచి 172 దరఖాస్తులు రాగా, ఇప్పటిదాకా కనీసం స్క్రూటినీ కూడా చేయలేదు. ఈ క్రమంలోనే 'తాత్కాలికంగా' నలుగురిని తీసుకోవడం చూస్తే నోటిఫికేషన్‌కు మంగళం పాడతారేమోనంటూ టీచర్లు చర్చించుకుంటున్నారు.

దళిత బిడ్డకు న్యాయం చేయండి

- గిరిజన విద్యార్థిని తన్మయి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి
- మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు వైఎస్సార్ సీపీ మహిళా విభాగం వినతి

అనంతపురం కార్పొరేషన్: మృగాళ్ల చేతిలో అత్యాచారానికి గురైన దళిత బిడ్డకు న్యాయం చేయాలని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నేతలు కోరారు. బుధవారం నగరంలోని ఎస్‌ఎస్‌బీఎన్ కళాశాలలో ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజను వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నేతలు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో దళితులు, గిరిజన మహిళలు, బాలికలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయన్నారు. దౌర్జన్యాలు, దాడులు అధికమయ్యాయన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా ఏడుగుర్రాలపల్లిలో దళిత మైనర్ బాలికపై అదే గ్రామానికి చెందిన కొందరు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని తెలిపారు. అనంతపురం నగరంలోని రామకృష్ణ కాలనీకి చెందిన గిరిజన విద్యార్థిని తన్మయిని అత్యంత కిరాతకంగా హత్య చేశారన్నారు. ఈ రెండు ఘటనలపై ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ చేపట్టి నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూడాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం మేరకు ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. తన్మయి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇంటి స్థలం, వ్యవసాయ భూమి మంజూరు చేయాలన్నారు. గతంలో జిల్లా పర్యటనకు వచ్చిన సమయంలోనే ఈ విషయంపై విన్నవించినా ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయారు. కాగా, శైలజ విలేకరులతో మాట్లాడారు. యువత, అమ్మాయిలపై సినిమాల ప్రభావం తీవ్రంగా ఉంటోందని అన్నారు. మహిళల రక్షణ, భద్రత, సాధికారతపై అన్ని జిల్లాల్లో అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నగరాధ్యక్షురాలు సాకే చంద్రలేఖ, పార్టీ మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి అంజలి, పంచాయతీరాజ్ విభాగం ప్రధాన కార్యదర్శి హజర, మహిళా నాయకురాళ్లు ఉష, రాధాయాదవ్, భారతి, లీలా, ఎస్సీ, ఎస్టీ సెల్ నాయకులు చిరంజీవి, నాగరాజు నాయక్, మణికంఠ, సంగమేష్ పాల్గొన్నారు.



చైర్‌పర్సన్ శైలజకు వినతి పత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నేతలు

చైర్‌పర్సన్ వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు..

మృగాళ్ల చేతిలో అత్యాచారానికి గురైన బాలికను కనీసం ఆ ప్రాంత ఎమ్మెల్యే పరిటాల సునీత, ఉమ్మడి జిల్లాలోని ప్రజాప్రతినిధులు పరామర్శించిన దాఖలాలు లేవు. మొదట్లో బాలికకు జరిగిన అన్యాయం పట్ల శ్రీ సత్యసాయి జిల్లా పోలీసులు స్పందించనే లేదు. బాలిక తరఫున ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామంటూ అప్పట్లో సీఐ, ఎస్‌ఐలు నిర్లక్ష్యంగా మాట్లాడారు. 'సాక్షి'లో కథనం వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వంలో చలనమొచ్చింది. ప్రభుత్వానికి మరింత అప్రతిష్ట తప్పదని భావించి చర్యలకు ఉపక్రమించింది. ఆడబిడ్డలకు అన్యాయం జరిగితే సహించబోమంటూ ఊదరగొడుతున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు.. దేశవ్యాప్తంగా కలకలం రేపిన ఈ ఘటనపై కనీసం మాట కూడా మాట్లాడలేదు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. కానీ, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ అన్నీ చేశామని చెప్పడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

'బాలికకు ప్రభుత్వం అన్నీ సమకూర్చింది'

ఏడుగుర్రాలపల్లిలో సామూహిక అత్యాచారానికి గురైన మైనర్ బాలికకు ప్రభుత్వం అన్నీ సమకూర్చిందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. బుధవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రి లేబర్ వార్డులో ఉన్న బాధితురాలిని ఆమె పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆస్పత్రిలో బాలికకు సుఖ ప్రసవం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. నిందితులను పోలీసులు సకాలంలో అరెస్టు చేశారన్నారు.

మలేరియా అధికారి బంగారం, నగదు మాయం

అనంతపురం: గుంటూరు నుంచి ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో ప్రయాణించి అనంతపురానికి చేరుకున్న ప్రయాణికురాలి వద్ద ఉన్న బంగారు నగలు, నగదు మాయమయ్యాయి. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు అనంతపురం రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు... జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఓబులు కొన్ని రోజుల క్రితం గుంటూరులో మోకాలి శస్త్రచికిత్సకు వెళ్లారు. ఆ సమయంలో ఆయనకు సహాయకురాలిగా భార్య డి.కోటేశ్వరమ్మ ఉన్నారు. ఈ నెల 23న డాక్టర్ ఓబులు విధుల్లో చేరాల్సి ఉండడంతో గుంటూరులోని శ్యామల నగర్‌లో ఉన్న తమ సొంత అపార్ట్‌మెంట్‌లోని విలువైన బంగారు నగలు, రూ.500 నోట్ల కట్టలు రెండు (రూ.లక్ష), మరికొంత చిల్లరను హ్యాండ్ బ్యాగ్‌లో ఉంచుకుని మంగళవారం రాత్రి మదీనా ట్రావెల్స్ బస్సు (స్లీపర్)లో ఇద్దరూ బయలుదేరారు. గుత్తిలో హ్యాండ్ బ్యాగును పరిశీలించుకున్నారు. నగదుతో పాటు బంగారు నగలూ ఉన్నాయి. బుధవారం తెల్లవారుజామున అనంతపురంలో బస్సు దిగి ఆటోలో ఇంటికి చేరుకుని హ్యాండ్ బ్యాగ్‌ను పరిశీలిస్తే అందులో బంగారు నగలు, నగదు లేవు. పోస్ట్ ఆపరేషన్ ఖర్చులకు గాను రూ.లక్షకు పైగా నగదు బ్యాగులో తీసుకొచ్చినట్లు డాక్టర్ ఓబులు భార్య కోటేశ్వరమ్మ తెలిపారు. విషయాన్ని వెంటనే అనంతపురం రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 40 గ్రాముల బరువైన రెండు బంగారు చైన్‌లు, రెండు ఉంగరాలు (11 గ్రాములు), మహిళల ఉంగరాలు 12 (50 గ్రాములు), నల్లపూసల చైన్ (35 గ్రాములు), నల్లపూసలచైన్ (చిన్నది – 5 గ్రాములు), బ్రాస్‌లైట్ (16 గ్రాములు), 4 జతల చెవిదుద్దులు వెరసి మొత్తం 170 గ్రాముల బంగారు, రూ.1.22 లక్షల నగదు అపహరణకు గురైనట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
RACPC-64154, ధర్మవరం, శ్రీ సత్యసాయి జిల్లా

A/C No's. 1) 39135612468 (H/L) 2) 40401619518 (H/L), 3) 39204522632 (Suraksha Loan)

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కోసం)

(అనుబంధం-IV చట్టం - రూల్ 8(1) మరియు (2) క్రింద)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సిల్క్ బ్రాంచ్, ధర్మవరం, ప్రస్తుత నిర్వహణ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, **RACPC-64154**, ధర్మవరం, శ్రీ సత్యసాయి జిల్లా యొక్క అధీకృత అధికారియగు దిగువ సంతకందారు **03-05-2025** తేదీగల డిమాండ్ నోటీసు మరియు **18-05-2025** తేదీగల పత్రికా ప్రచురణ జారీ చేసి, రుణగ్రహీత: శ్రీమతి భోగవల్లి రాజేశ్వరి భర్త వారణాసి వెంకట నరసయ్య, డి.నెం.28-5-432, ఫ్లాట్ నెం.యం.ఐ.జి.-316, ఎ.పి.హెచ్.బి. కాలనీ, ఆర్.టి.ఒ. ఆఫీస్ రోడ్డు, అనంతపురము. సహరుణగ్రహీత :శ్రీ వారణాసి వెంకట నరసయ్య తండ్రి వారణాసి శివరామ్, డి.నెం.28-5-432, ఫ్లాట్ నెం. **MIG-316, APHB** కాలనీ, **RTO** ఆఫీస్ రోడ్డు, అనంతపురము. వారిని నోటీసులో తెలిపిన మొత్తం 1) **03-05-2025** నాటికి **రూ.51,65,445/-** (యాభై ఒక లక్షల అరవై ఐదు వేల నాలుగు వందల నలభై ఐదు రూపాయలు మాత్రమే) 2) **03-05-2025** నాటికి **రూ.13,14,208/-** (పదమూడు లక్షల పదునాలుగు వేల రెండు వందల ఎనిమిది రూపాయలు మాత్రమే) 3) **03-05-2025** నాటికి **రూ.3,70,455/-** (మూడు లక్షల డెబ్బై వేల నాలుగు వందల యాభై ఐదు రూపాయలు మాత్రమే) మరియు **04-05-2025** నుండి కాంట్రాక్చువల్ రేటు వంతున తదుపరి వడ్డీ మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, చార్జీలు మొ॥వాటిని సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా తిరిగి చెల్లించాలని కోరారు.

రుణగ్రహీత సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ దిగువ వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు **18-07-2025**న లాంఛనప్రాయ స్వాధీనం చేసుకున్నారని ముఖ్యంగా రుణగ్రహీతకు/ గ్యారంటార్లకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

సదరు ఆస్తితో ఎలాంటి వ్యవహారం జరపరాదని మరియు సదరు ఆస్తితో జరిపే ఏ వ్యవహారమైనా 1) **03-05-2025** నాటికి **రూ.51,65,445/-** (యాభై ఒక లక్షల అరవై ఐదు వేల నాలుగు వందల నలభై ఐదు రూపాయలు మాత్రమే) 2) **03-05-2025** నాటికి **రూ.13,14,208/-** (పదమూడు లక్షల పదునాలుగు వేల రెండు వందల ఎనిమిది రూపాయలు మాత్రమే) 3) **03-05-2025** నాటికి **రూ.3,70,455/-** (మూడు లక్షల డెబ్బై వేల నాలుగు వందల యాభై ఐదు రూపాయలు మాత్రమే) + **04.05.2025** నుండి కాంట్రాక్చువల్ రేటు వంతున తదుపరి వడ్డీ + అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, మొ॥వి **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, RACPC,** ధర్మవరం, శ్రీ సత్యసాయి జిల్లా చార్జీకు లోబడి ఉంటాయని ముఖ్యంగా రుణగ్రహీతను/ గ్యారంటార్లను మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

స్థిరాస్తి వివరణ

అనంతపురము **RD** మరియు అనంతపురము **SRD** అనంతపురము గ్రామ పరిధి, అనంతపురము రూరల్ పంచాయితీ ఏరియాలో పరిధిలో ఆస్తి కలదు. ఈ ఆస్తి రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.14585/2019, తేది : 07-12-2019 ప్రకారం శ్రీమతి భోగవల్లి రాజేశ్వరి, భర్త వారణాసి వెంకట నరసయ్యకు చెందినది.

బాబు వివరం	సర్వే నెం.	విస్తీర్ణం	బాబు వివరం	సర్వే నెం.	విస్తీర్ణం
సర్కారు ఖుష్కి	431-7	ఎ.4.55	సర్కారు ఖుష్కి	431-3	ఎ.0.61
సర్కారు ఖుష్కి	431-4	ఎ.0.55	సర్కారు ఖుష్కి	431-5	ఎ.0.47
సర్కారు ఖుష్కి	431-6	ఎ.0.49	సర్కారు ఖుష్కి	432-4	ఎ.1.34
సర్కారు ఖుష్కి	432-5	ఎ.1.42	సర్కారు ఖుష్కి	432-6	ఎ.1.40
సర్కారు ఖుష్కి	473-1	ఎ.3.98	సర్కారు ఖుష్కి	473-2	ఎ.0.60
సర్కారు ఖుష్కి	470-2	ఎ.2.08			

ఈ పైకి ఎ. 0.78 1/2 సెంట్లు పైకి ఎ. 0.05 సెంట్లు, ఫ్లాట్ నెం.131 పైకి ఎ. 0.04.318, హెచ్.యస్. 0.017. సరిహద్దులు : తూర్పు : ఫ్లాట్ నెం.195; పడమర : 40 అడుగుల వెడల్పు రోడ్డు; ఉత్తరం : ఫ్లాట్ నెం. 132; దక్షిణం : అదే ఫ్లాట్ నెం.131 లోని మిగిలిన ఏరియా. కొలతలు : తూర్పు-పడమర: 66 అడుగులు లేదా 20.12 మీటర్లు; ఉత్తరం-దక్షిణం : 28 1/2 అడుగులు లేదా 8.69 మీటర్లు. మొత్తం విస్తీర్ణం : 4.318 సెంట్లు లేదా 209 చ.గజాలు.

తేది : 18-07-2025
ప్రదేశం : ధర్మవరం

సం/- అధీకృత అధికారి,
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, RACPC, ధర్మవరం.

ఉల్లి .. సాగు సన్నగిల్లి!

అంతర్జాతీయ వాణిజ్య పంటగా గుర్తింపు పొందిన ఉల్లి సాగు జిల్లాలో సన్నగిల్లుతోంది. వివిధ కారణాలతో ఉల్లి సాగుపై రైతులు ఆసక్తి కనపరచడం లేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావొస్తున్నా పది శాతం కూడా సాగులోకి రాకపోవడమే ఇందుకు నిదర్శనం.

గణనీయంగా తగ్గిన సాగు
- రాయితీ విత్తనాలు అందించడంలో సర్కార్ విఫలం
- మద్దతు ధర, మార్కెట్ సౌకర్యమూ కరువే



రాయదుర్గం: జిల్లాలోని రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఐదు వేల ఎకరాల్లో, మరి కొన్ని మండలాల్లో కొద్ది మేరకు రైతులు ఉల్లిని సాగు చేస్తున్నారు. ఇందులో ఒక్క గుమ్మఘట్ట మండలంలోనే రైతులు 2 వేల నుంచి 2,500 ఎకరాల్లో ఉల్లిని సాగు చేస్తున్నారు. ఆ తర్వాత వెయ్యి నుంచి 1,500 ఎకరాలతో బ్రహ్మసముద్రం, బెళుగుప్ప మండలాలు రెండో స్థానంలో నిలిచాయి. మరో 12 మండలాల్లో 2 వేల ఎకరాల్లో ఉల్లి సాగులో ఉంటోంది. అయితే ఈ సారి కనీసం 600 ఎకరాలు కూడా దాటని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పాటికి సుమారు 3 వేల ఎకరాలకు పైగా సాగు చేయాల్సి ఉండగా 10 శాతం కంటే తక్కువ విస్తీర్ణంలో ఉల్లి సాగులోకి వచ్చింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఉల్లి ధరలు ఆకాశానికి అంటడం ఖాయమనే వాదనలు వినవస్తున్నాయి. సాధారణంగా ఉల్లి సాగుకు ఎకరాకు ఐదు లేదా ఆరు కిలోల విత్తనాలు అవసరం కాగా, కిలో విత్తనం నాణ్యత ఆధారంగా రూ.1,800 నుంచి రూ.2,200 వరకు బయట మార్కెట్‌లో రైతులు కొనుగోలు చేయాల్సి వస్తోంది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కలుపు ఇతర ఖర్చులు వెరసి ఎకరాకు ఎంత తక్కువన్నా రూ.50వేల నుంచి రూ.60 వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. గిట్టుబాటు ధర లేకపోవడంతో కనీస పెట్టుబడులు కూడా చేతికి అందవనే భావన రైతుల్లో వ్యక్తమవుతోంది.

పెట్టుబడుల భారంతో చేతులెత్తేసిన రైతులు

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఏటా ఉల్లి సాగు తగ్గుతూ వస్తోంది. లక్షల క్వింటాళ్ల దిగుబడి ఉన్న చోట ప్రస్తుతం వేళ్లతో లెక్కించే పరిస్థితి నెలకొంది. సారవంతమైన భూములు కావడంతో ఎకరాకు 300 నుంచి 350 ప్యాకెట్ల ఉల్లి పండించిన రైతులూ ఉన్నారు. క్వింటా రూ.2 వేలు ధర లభించినా రూ.2 లక్షల నుంచి రూ.2.20 లక్షలు చేతికి దక్కేది. పదెకరాల్లో సాగుచేసిన రైతు రూ.20 లక్షల నుంచి రూ.22 లక్షలకు పైగా ఆదాయాన్ని గడించారు. తాజాగా ఆ పరిస్థితులు కనిపించడం లేదు. ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం లేకపోవడంతో ఉల్లి సాగుకు రైతులు మొగ్గు చూపడం లేదు. ఉల్లి విత్తనాలు రాయితీతో అందించడంలోనూ, కనీస మద్దతు ధర ప్రకటించడంలోనూ, సరైన మార్కెట్ సదుపాయం కల్పించడంలోనూ ప్రభుత్వం ఘోరంగా విఫలం కావడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. పండించిన పంటను అమ్ముకోవాలంటే రాజమండ్రి, బెంగళూరు, పూణే లాంటి పెద్ద మార్కెట్లను రైతులు ఆశ్రయించాల్సి వస్తోంది. దీనికి తోడు కొత్త రకం తెగుళ్లు వెంటాడటం, సరైన అవగాహన లేక ఇష్టారీతిన పురుగు మందులు వినియోగిస్తుండడంతో పెట్టుబడులు తడిసి మోపెడవుతున్నాయి. దీంతో జిల్లా రైతులు చేతులు ఎత్తేయడంతో.. కర్ణాటకలో పండిస్తున్న ఉల్లిపైనే ఆధారపడాల్సి వస్తోంది.

సాగు వదులుకున్నా



మా గ్రామ పరిసరాల్లో ఎంత తక్కువన్నా 300 ఎకరాల్లో పోటాపోటీగా ఉల్లిని రైతులు సాగు చేసే వారు. ఇప్పుడా పరిస్థితులు కనిపించడం లేదు. ఏటా 20 ఎకరాలకు తక్కువ కాకుండా ఉల్లి సాగు చేసే నేనే ఈ సారి సాగు వదులుకున్నా. రెండు ఎకరాలకు విత్తనాలు చల్లుకుంటే ఓసారి వడగళ్ల వర్షం, మరోసారి విత్తన లోపం కారణంగా రూ.40 వేలు నష్టపోయాను. దీంతో సాగు పూర్తిగా వదిలేసి మొక్కజొన్న పెట్టుకున్నాను. అధిక తెగుళ్లు, సరైన విత్తనాల కొరత, మార్కెటింగ్ సౌకర్యం లేక రైతులు ఉల్లి సాగుకు దూరమవుతున్నారు. ప్రభుత్వం ఆదుకునే చర్యలు చేపడితే సాగు విస్తీర్ణం పెంచుకోవచ్చు.

– హరినాథరెడ్డి, ఉల్లి రైతు, ఆర్.కొత్తపల్లి, గుమ్మఘట్ట మండలం

అమలు చేత కానప్పుడు హామీ ఎందుకిచ్చారు?

- ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి



గుంతకల్లు: ఆడబిడ్డ నిధి పథకం అమలు చేతకానప్పుడు ఎన్నికల సమయంలో హామీని ఎందుకు ఇచ్చారంటూ కూటమి ప్రభుత్వ పెద్దలను కర్నూలు జిల్లా ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి ప్రశ్నించారు. గుంతకల్లులోని మస్తానయ్య స్వామిని బుధవారం ఆయన దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని సాయినగర్‌లోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇంట్లో ఎంత మంది ఆడబిడ్డలు ఉంటే అంతమందికి ఆడబిడ్డ నిధి కింద రూ.1,500 ఇస్తామంటూ చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఇద్దరూ సంతకం చేసిన బాండ్ పేపర్లను ఇంటింటికీ పంచారని గుర్తు చేశారు. ఈ హామీని అమలు చేయాలంటే రాష్ట్రాన్నే అమ్మేయాల్సి వస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు అసంబద్ధంగా ఉన్నాయన్నారు. దీనిని బట్టి చూస్తే కూటమి ప్రభుత్వం మాటపై నిలబడేది కాదని స్పష్టమైందన్నారు. ప్రజాసంకల్ప పాదయాత్రలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి ఒక్క హామీనీ అధికారం చేపట్టిన తర్వాత అత్యంత పారదర్శకంగా అమలు చేశారని గుర్తు చేశారు. కరోనా విపత్కర సమయంలోనూ సంక్షేమాన్ని, అభివృద్ధిని ఎక్కడేగాని ఆపలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తల్లికి వందనం పథకం కింద 87 లక్షల మంది అర్హులకు గాను 35 లక్షల మందికి మొండిచెయ్యి చూపారన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లి ప్రజలను చైతన్య పరుస్తామన్నారు.

31లోపు పంటల బీమా ప్రీమియం చెల్లించండి

- రైతులకు జేడీఏ ఉమామహేశ్వరమ్మ సూచన



చిన్నముష్టూరు వద్ద ఈ-క్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న జేడీఏ ఉమామహేశ్వరమ్మ

ఉరవకొండ: జిల్లాలో ఖరీఫ్ కింద పంటలు సాగు చేసిన రైతులు ఈ నెల 31వ తేదీలోపు పంటల బీమా ప్రీమియంను చెల్లించాలని జేడీఏ ఉమామహేశ్వరమ్మ తెలిపారు. ఉరవకొండ మండలం చిన్నముష్టూరు, పెద్దముష్టూరు గ్రామాల్లో ఈ-క్రాప్ బుకింగ్ కార్యక్రమాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. మూలగిరపల్లిలో ఎన్ఎంఈఓ పథకం కింద వేరుశనగ విత్తనం సాగు చేస్తున్న పొలాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. జిల్లాలో 60 వేల హెక్టార్లలో వేరుశనగ సాగులో ఉందన్నారు. అనంతరం వజ్రకరూర్ మండలం పీసీప్యాపిలిలో చేపట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. పల్స్ గ్రామంగా ఎంపికైన పీసీ ప్యాపిలీలో కేవీకే రెడ్డిపల్లి వ్యవసాయ క్షేత్రం ఆధ్వర్యంలో ఉచితంగా అందించిన కంది పీజీఆర్‌జీ 176 రకం విత్తనంతో సాగు చేసిన పంటను పరిశీలించారు. అనంతరం ఉరవకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... జిల్లాలో ఇప్పటి వరకూ 40 శాతం తక్కువ వర్షపాతం నమోదైందన్నారు. రైతులు వేరుశనగ సాగు చేయడానికి వర్షం కోసం చూస్తున్న పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో ఉరవకొండ వ్యవసాయాధికారి రామకృష్ణుడు, ఏఈఓలు పాల్గొన్నారు.

హైకోర్టు ఉత్తర్వులు కూడా పాటించరా?



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: ఎంపీ మిథున్‌రెడ్డికి జైలులో ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలంటూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ప్రభుత్వం కనుసన్నల్లో జైలు అధికారులు బేఖాతరు చేశారంటూ అనంతపురం మేయర్ వసీం విమర్శించారు. లేని లిక్కర్ స్కామ్‌ను సృష్టించి కూటమి ప్రభుత్వం చేపట్టిన అక్రమ అరెస్టులను ఖండిస్తూ వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగజ్‌ఘర్ రిజ్వాన్, జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, మహిళా నాయకురాలు కమర్‌తాజ్, తదితరులతో కలిసి బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లిక్కర్ స్కాం జరగలేదనే విషయం జగమెరిగిన సత్యమన్నారు. పథకాలు అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్‌తో ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. మహిళలకు ఆడబిడ్డ నిధి ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్మేయాలంటూ మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. సమావేశంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఫయాజ్, కార్పొరేటర్లు ఇషాక్, అబూసలేహా, రహంతుల్లా, కోఆప్షన్ సభ్యుడు షంషుద్దీన్, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్రపాడు హుస్సేన్ పీరా, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు దాదాఖలందర్, నాయకులు ఏ1 రఫీ, దాదు, జావీద్, రియాజ్, మహబూబ్‌బాషా, ఆదాం, నిజాం, ఆసిఫ్, హుస్సేన్, పీరా, తబ్రేజ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు దుర్మరణం



నల్లప్ప (ఫైల్)

గార్లదిన్నె: కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ రైతు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం జంబులదిన్నెకు చెందిన కల్లుమడి నల్లప్ప (50)కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. సోములదొడ్డిలో నివాసముంటూ వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో బుధవారం ఓబుళాపురం వద్ద ఉన్న తన తోటలో పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరుగు ప్రయాణమైన ఆయన జంబులదిన్నె కొట్టాల సమీపంలోకి చేరుకోగానే వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన ఇన్నోవా కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

జీజీహెచ్‌లో పోలీసుల ఓవరాక్షన్



చంటిపాపను చికిత్స కోసం తీసుకెళుతున్న తల్లిదండ్రులను అడ్డుకుంటున్న పోలీసులు



రోగుల సహాయకులను అడ్డుకుంటున్న సీఐ వలీబాషా

అనంతపురం మెడికల్: రాత్రి సమయాల్లో సర్వజనాస్పత్రి (జీజీహెచ్)లో వైద్యులు, సిబ్బందిపై తాగుబోతులు, పోకిరీలు దాడులు చేస్తున్నా.. ఏనాడూ అటుగా చూడని పోలీసులు ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ రాకతో అత్యుత్సాహం కనబరిచి రోగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. రామగిరి మండలంలో అత్యాచారానికి గురైన దళిత మైనర్ బాలికను పరామర్శించేందుకు బుధవారం రాయపాటి శైలజ జీజీహెచ్‌కు చేరుకున్నారు. అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఆస్పత్రి మొత్తాన్ని అనంతపురం రెండో పట్టణ పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. లేబర్ వార్డు వైపుగా ఈగను సైతం వెళ్లకుండా పహారా కాశారు. అడుగడుగునా ఆంక్షలు విధిస్తూ రోగుల సహాయకులను రక్త నిధి కేంద్రానికి సైతం వెళ్లకుండా అడ్డుకున్నారు. వార్డులనూ ఆధీనంలో ఉంచుకున్నారు. ఎక్స్‌రే, సిటీస్కాన్, ఎంఆర్‌ఐ స్కాన్‌కు వెళ్లేవారు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. ఆస్పత్రిలో రోగులకంటే పోలీసులే అధికంగా ఉండడంతో వైద్య సిబ్బంది సైతం విధులను సక్రమంగా నిర్వర్తించలేక ఇబ్బంది పడ్డారు.

జేసీ వ్యాఖ్యలపై వాల్మీకి గెజిటెడ్ అధికారుల సంఘం మండిపాటు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడుపై తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆలిండియా వాల్మీకి గెజిటెడ్ అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు బుధవారం సంఘం జిల్లా అధ్యక్షుడు డి.నరహరి ఓ ప్రకటన విడుదల చేశారు. పరిపాలన పరమైన సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవచ్చన్నారు. అలా కాకుండా నిబద్ధతతో పని చేస్తున్న అధికారిని పరుషపదజాలంతో దూషించి, అవమానించడం సరికాదన్నారు. ఉద్యోగుల విలువలు, వాల్మీకుల మనోభావాలు దెబ్బతినకుండా ఇప్పటికైనా జేసీ ప్రభాకర్‌రెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దళిత ద్రోహి ఎంఎస్ రాజు

- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ ధ్వజం



మాట్లాడుతున్న సాకే చంద్ర

అనంతపురం కార్పొరేషన్: 'శ్రీసత్యసాయి జిల్లా ఏడుగుర్రాలపల్లిలో ఓ దళిత మైనర్ బాలికకు అన్యాయం జరిగితే న్యాయం చేయలేని నువ్వు నిజంగా దళిత ద్రోహివే' అంటూ మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజుపై వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ ధ్వజమెత్తారు. బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేసిన వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులను సన్యాసులంటూ మాట్లాడుతావా? అంటూ మండిపడ్డారు. ఇటీవల ఎమ్మెల్యే ఎంఎస్ రాజు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకుని బాధితురాలికి అండగా నిలవాలని హితవు పలికారు. మైనర్ బాలిక కేసులో 14 మందిని అరెస్ట్ చేసినంత మాత్రానా.. న్యాయం చేసినట్లు కాదన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నగరంలోని అశోక్‌నగర్‌లో ఓ దళిత యువతి హత్యకు గురైతే అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తక్షణమే స్పందించి యువతి కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు, ఐదెకరాల భూమిని కేటాయించేలా చర్యలు తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి సమక్షంలో మృతురాలి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియాను ప్రభుత్వం అందజేసిందన్నారు. ఆ సమయంలో ఉనికి కోసం ఓవరాక్షన్ చేసిన టీడీపీ నాయకులు.. నేడు ఓ దళిత మైనర్ బాలికకు, మరో గిరిజన యువతికి అన్యాయం జరిగినా కనీసం నోరు కూడా మెదపడం లేదన్నారు. ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే కూటమి ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎవరెన్ని కేసులు పెట్టినా, అరెస్టులు చేసినా భయపడే ప్రసక్తి లేదన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాకే శ్రీనివాసులు, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు దాదాఖలందర్, ఎస్సీ సెల్ శింగనమల నియోజకవర్గ అధ్యక్షుడు అంజి, పార్టీ నగర కార్యదర్శి సురేంద్ర పాల్గొన్నారు.

812 లీటర్ల మద్యం పారబోత



మద్యాన్ని పారబోస్తున్న ఎక్సైజ్ అధికారులు

రాయదుర్గం: స్థానిక ప్రొహిబిషన్, బొమ్మనహాళ్, బెళుగుప్ప పోలీస్ స్టేషన్ల పరిధిలో పట్టుబడిన 812 లీటర్ల కర్ణాటక మద్యం, బీర్లను బుధవారం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డీపీఈఓ (ఈఎస్) రామమోహన్‌రెడ్డి పారబోశారు. అలాగే రాయదుర్గం ఎక్సైజ్, డి.హీరేహాళ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా కర్ణాటక మద్యం రవాణా చేస్తూ పట్టుబడిన 31 వాహనాలను స్థానిక సీఐ మహేష్‌కుమార్, ఈఎస్‌టీఎఫ్ సీఐ జయనాథరెడ్డి, డి.హీరేహాళ్ ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ఎక్సైజ్ పీఎస్ పరిధిలో 19 వాహనాలకు రూ.1,44,550, డి.హీరేహాళ్ పీఎస్ పరిధిలోని 12 వాహనాలకు రూ.1,22,956 ఆదాయం సమకూరినట్లు ఈఎస్ తెలిపారు. అనంతరం మద్యం దుకాణ యజమానులతో సమావేశమై మాట్లాడారు. అధిక ధరకు మద్యం విక్రయించరాదని, బెల్టు షాపుల నియంత్రణకు సహకరించాలని సూచించారు. అలాగే కర్ణాటక సరిహద్దున ఉన్న డి.హీరేహాళ్, విడపనకల్లు చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. కర్ణాటక మద్యం రవాణా కాకుండా కట్టడి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

ఆడబిడ్డ నిధిపై అచ్చెన్న వ్యాఖ్యలు దారుణం

- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

గుత్తి: ఆడబిడ్డ నిధి పథకంపై మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయని ఉరవకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి అన్నారు. గుత్తిలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో బుధవారం ఆయన మాజీ ఎంపీపీ కోనా మురళీధర్ రెడ్డితో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నాయకులను తిట్టడమే పనిగా కూటమి ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, నాయకులు పెట్టుకున్నారన్నారు. రాష్ట్రంలో రాజకీయ కక్ష సాధింపులు తారస్థాయికి చేరుకున్నాయని మండిపడ్డారు. నిత్యం అబద్ధాలు చెప్పడం చంద్రబాబు, ఆయన కోటరీకి పరిపాటిగా మారిందన్నారు. ఆడబిడ్డ నిధి ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్మేయాలంటూ మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయన్నారు. ఎన్నికల సమయంలో ఆడబిడ్డ నిధి గురించి విస్తృత ప్రచారం చేసి లబ్ధి పొందిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కు.. ఆ రోజున పథకం అమలుకు డబ్బులు ఉన్నాయో? లేదో తెలియదా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఇష్టానుసారం ఏదీ పడితే అది హామీలు ఇవ్వడం తీరా అధికారంలోకి వచ్చాక మాట తప్పడం చంద్రబాబుకు కొత్తేమీ కాదన్నారు. త్వరలోనే ప్రజలు కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతారన్నారు.

నేతన్నలకు ఏదీ చేయూత?

- ప్రభుత్వంపై చేనేత కార్మిక సంఘం నాయకుల ధ్వజం



చేనేత శాఖ ఏడీ వరప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న చేతన కార్మిక సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వంలో నేతన్నలకు చేయూత కరువైందని ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు ధ్వజమెత్తారు. అధికారంలోకి వస్తే రూ.36 వేలు ఇస్తామంటూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ఏమైందని ప్రభుత్వాన్ని నిలదీశారు. చేనేత కార్మికులు, సొసైటీల విషయంలో కూటమి సర్కార్ నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందని మండిపడ్డారు. బుధవారం సంఘం ఆధ్వర్యంలో చేనేత కార్యాలయం వద్ద నాయకులు నిరసన తెలిపి అసిస్టెంట్ డైరెక్టర్ వరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, గోవిందు మాట్లాడారు. నేతన్న నేస్తం ద్వారా చేనేత కార్మికులకు గత ప్రభుత్వం ఏడాదికి రూ.24 ఇచ్చేదని గుర్తు చేశారు. తాము అధికారంలోకి వస్తే ఏటా రూ.36 వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి ఏడాదైనా హామీ అమలు కాలేదని మండిపడ్డారు. చేనేత మగ్గాలకు 200 యూనిట్ల ఉచిత కరెంట్ ఇస్తామని చెప్పిన హామీ మాటలకే పరిమితమైందన్నారు. చాలాచోట్ల విద్యుత్ లేక నేయర్లు, దర్జీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా చేనేత కార్మికులు ఉన్నప్పటికీ పాత బకాయిలు విడుదల చేయలేదన్నారు. సొసైటీలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లేదన్నారు. సొసైటీలను అడ్డుపెట్టుని అక్రమాలకు పాల్పడుతున్న అవినీతిపరులపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ ప్రణాళికల్లో స్పష్టత లేకపోవడంతో కార్మికుల జీవితాలు సంక్షోభంలో కూరుకుపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చేనేత కార్మికులకు బకాయిలు చెల్లించాలన్నారు. సొసైటీలపై సమగ్ర విచారణ జరిపించి అవినీతిపరుల పేర్లను బహిర్గతం చేయడంతో పాటు చర్యలు తీసుకోవాలన్నారు. మార్కెట్ సదుపాయం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయులకు వీడ్కోలు



బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

చెన్నేకొత్తపల్లి: సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడి నుంచి ఇతర మండలాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులను చెన్నేకొత్తపల్లి మండల శాఖ పీఆర్‌టీయూ నాయకులు బుధవారం సన్మానించారు. 12 మంది ఉపాధ్యాయులను పూలమాలతో సన్మానించి, వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు సాయినాథరెడ్డి, ప్రధాన కార్యదర్శి భూషణ, వన్నారామిరెడ్డి, రామాంజనేయులు ఇతర ఉపాధ్యాయ సంఘాల నాయకులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేడు చౌడేశ్వరి జయంత్యుత్సవం



అలంకరణలో చౌడేశ్వరి దేవి

అనంతపురం కల్చరల్: తొగటవీర క్షత్రియుల ఆరాధ్య దేవత చౌడేశ్వరి దేవి జయంత్యుత్సవాన్ని గురువారం నేత్రపర్వంగా నిర్వహించనున్నారు. నగరంలో వెలసిన చౌడేశ్వరీ అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. విజయనగర కాలనీలో వెలసిన చౌడేశ్వరి దేవి కల్యాణ భవన్ వేదికగా విశేష పూజా కార్యక్రమాలతో పాటూ వివిధ పాఠశాలల్లో 10వ తరగతిలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తారు. మొదటి రోడ్డు, గుత్తి రోడ్డుల్లో వెలసిన చౌడేశ్వరీ మాత ఆలయాల్లో అభిషేకాలు, అలంకార సేవలు, గ్రామోత్సవ వేడుకలు జరగనున్నాయి.

ఉన్నత పాఠశాలకు విరాళం



పాఠశాల హెచ్‌ఎంకు విరాళం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఆత్మకూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన 1997–98 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు తాము చదివిన పాఠశాలకు రూ.లక్ష విరాళం అందజేశారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయులకు డబ్బు అందజేశారు. ఆ డబ్బును బ్యాంక్‌లో డిపాజిట్ చేసి వచ్చే వడ్డీతో గణతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహిస్తామని ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుపేదల అభ్యున్నతే లక్ష్యం



మాట్లాడుతున్న బబ్లూ గంగూలీ

చెన్నేకొత్తపల్లి: భూమి లేని నిరుపేదల అభివృద్ధే గ్రామసిరి సొసైటీ లక్ష్యమని టింబక్టు కలెక్టివ్ సంస్థ వ్యవస్థాపకులు మేరీ వటమట్టమ్, బబ్లూ గంగూలీ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయం ఆవరణలో బుధవారం 15వ వార్షిక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కూలీలు, చిన్నజీవాల పెంపకందారులతో పొదుపు సంఘాలను ఏర్పాటు చేసి వారికి సొసైటీ ద్వారా అప్పులు ఇవ్వడం జరుగుతుందన్నారు. జీవాల పెంపకం, పశుపోషణపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. చెన్నేకొత్తపల్లి, రామగిరి, రొద్దం, పెనుకొండ మండలాల్లోని 60 గ్రామాల్లో 98 సంఘాలు పని చేస్తున్నాయన్నారు.కార్యక్రమంలో సిబ్బంది మహేష్, సుకన్య, శ్రీకాంత్, లక్ష్మీనరసమ్మ, తిరుమల దేవి, రమేష్, మధు, మమత, కుళ్లాయప్ప, ఆంజనేయులు, 4 మండలాల్లోని చిన్నజీవాల పెంపకందారుల సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రిరూరల్: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వరప్రసాద్ ఘటనాస్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. దాదాపు 40 ఏళ్లున్న వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని, అతడి జేబులో చెన్నై సెంట్రల్ నుంచి కడపకు వెళ్లేందుకు తీసుకున్న జనరల్ టికెట్ ఉందన్నారు.

శ్రావణం.. శుభప్రదం

- రేపటి నుంచి ప్రారంభం కానున్న నోముల మాసం



అనంతపురం కల్చరల్: ఈనెల 24న అమావాస్య రాకతో ఆషాఢ మాసం ముగుస్తూ, ఈ సారి అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం నుంచే నోములు, వ్రతాలకు నెలవైన శ్రావణం మాసం ప్రారంభం కానుంది. మాస మంతటా అలరారే పండుగలు, సామూహిక వ్రతాలు ప్రతి ఇంటా సందడి చేయనున్నాయి. శ్రావణంలో భక్తిశ్రద్ధలతో ఆచరించే ప్రతి పండుగ వెనుక ఆధ్యాత్మిక కోణమే కాకుండా సామాజిక, వైజ్ఞానిక అంశాలెన్నో దాగున్నాయని పెద్దలు చెబుతున్నారు. మానవ సంబంధాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన శ్రావణ మాసం ఈ నెల 25 నుంచి ఆగస్టు 22 వరకు ఉంటుంది. ఇప్పటికే శ్రావణ మాస పూజల కోసం జిల్లా వ్యాప్తంగా ఆలయాలు ప్రత్యేకంగా ముస్తాబయ్యాయి.



పూజలందుకునే శ్రావణ లక్ష్మి

మహిళలకు ఎంతో ప్రీతికరం

నోములు, వ్రతాలు భక్తితో నోచుకుంటే దీర్ఘ సుమంగళిగా ఉంటామన్న విశ్వాసముండడంతో మహిళలు ఈ మాసాన్ని అత్యంత ప్రీతికరంగా భావిస్తారు. పౌర్ణమి చంద్రుడు శ్రవణా నక్షత్రం మీద సంచరించడం వల్ల ఈ మాసానికి శ్రావణం అని పేరొచ్చింది. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడిగా పూజలందుకుంటున్న వేంకటేశ్వరస్వామి ఇదే నక్షత్రంలో జన్మించి నందున ప్రత్యేకించి శ్రీవారి ఆలయాల్లో విశేష పూజలు జరుగుతాయి, ఆయన ఇష్టసఖి లక్ష్మీదేవికి, సోదరి గౌరికి సైతం ఇదే మాసంలో ప్రత్యేక పూజలు, వ్రతాలు చేస్తారు. ఈ క్రమంలో పలు ఆలయాలలో సామూహిక వ్రతాలు చేయించడానికి సన్నాహాలు చేస్తున్నారు. శ్రావణంలో వచ్చే మంగళవారాలతో పాటూ శుక్ర, శనివారాల్లో ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతాయి.

పండుగల సందడే

శ్రావణ మాసమంతటా పండుగల సందడితోనే సాగుతుంది. ఈ నెల 28న రానున్న నాగుల చవితితో పర్వదినాలు ఆరంభమవుతాయి. మరుసటి రోజునే గరుడ పంచమిని జరుపుకుంటారు. 29న మంగళగౌరీ వ్రతాలు ప్రారంభమవుతాయి. వచ్చే నెల 8న వరలక్ష్మీ వ్రతం, 9న రక్షా బంధనం (రాఖీ పౌర్ణిమ), ఉపాకర్మ, హయగ్రీవ జయంతి ఒకేరోజు వస్తాయి. ముఖ్యంగా ఇదే దినాన సంస్కృత భాషాదినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటారు. 10న రాఘవేంద్రస్వామి ఆరాధన ప్రారంభమై మూడురోజుల పాటు సాగుతుంది. 15, 16 తేదీల్లో శ్రీకృష్ణజన్మాష్టమి, బలరామ జయంతి, రాధాష్టమి పండుగలు వరుసగా ఉన్నాయి. మాసం చివరిరోజున కూడా అంటే ఆగస్టు 23న వచ్చే పొలాల అమావాస్యతో శ్రావణ మాసం సంపూర్ణంగా ముగుస్తుంది. వ్రతాలకు శ్రావణమాసాన్ని ఎంచుకోవడంలో ఆరోగ్యపరమైన కారణాలున్నాయని, పూజలకు సన్నాహాలు చేస్తున్నట్లు వేదపండితులు చెబుతున్నారు.

చక్కటి వ్యాయామంతో ఆరోగ్యం



హరిహర బేధం లేదని చాటే శ్రావణమాసంలో ఆచరించే కట్టుబాట్లు, నియమాలు చక్కటి వ్యాయామాన్ని, ఆరోగ్యాన్ని అందిస్తాయి. అలాగే సకల శుభాలనొసిగే శ్రావణం జ్ఞానసిద్ధినీ అందిస్తుంది. వానలు అధికంగా ఉండే ఈ రోజుల్లో ఇన్‌ఫెక్షన్లు సోకకుండా కాళ్లకు పసుపు పూసుకోవడం ఎంతో మేలు చేస్తుంది. మానసిక ఆనందం వల్ల మాసమంతటా శుభకరంగా ఉంటుంది. ఆవునూనెతో వెలిగించే దీపాల వల్ల ఆరోగ్యంతో పాటూ ఎంతో పుణ్యఫలమని శాస్త్రం చెపుతోంది.

– వైద్యుల రాఘవేంద్రాచార్, వేదపండితుడు

'అత్యాచార కేసుల్లో రాజకీయ జోక్యం వద్దు'



మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజకు వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా నాయకురాళ్లు

అనంతపురం అర్బన్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో మహిళలు, బాలికలపై చోటు చేసుకున్న దాడులు, హత్య, అత్యాచారాలపై సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని ఐద్వా నాయకురాళ్లు డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనల్లో రాజకీయ జోక్యం లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. బుధవారం అనంతపురం విచ్చేసిన రాష్ట్ర మహిళ కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజను స్థానిక ఎస్‌ఎస్‌బీఎన్ కళాశాలలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, జిల్లా నాయకురాళ్లు చంద్రిక, శైలజ, గీత కలసి వినతిపత్రం అందజేశారు. స్థానిక రామకృష్ణ కాలనీకి చెందిన ఇంటర్ విద్యార్థిని తన్మయి హత్య, శ్రీసత్యసాయి జిల్లాలో అత్తాకోడలిపై సామూహిక అత్యాచారం. రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలం ఏడు గుర్రాలపల్లిలో విద్యార్థినిపై 14 మంది అత్యాచారం చేసిన ఘటనల్లో దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి ఘటనలు నిత్యకృత్యం అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో బాలికలు, మహిళలపై లైంగిక వేధింపులూ పెరిగాయన్నారు. వీటికి కారణమైన మద్యం, గంజాయి, పోర్న్ వీడియోలను అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలోని అన్ని విద్యా సంస్థల్లోనూ అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి అత్యాచార, హత్య, దాడుల కేసులను త్వరిగతిన పరిష్కరించి దోషులకు కఠిన శిక్షలు పడేలా చూడాలన్నారు.

అనంతపురం టవర్‌క్లాక్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలపై అత్యాచారాలు, హత్యలు రోజు రోజుకి పెరిగిపోతున్నాయి. కీచకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాకే హరి మాట్లాడుతూ.. నారాయణ పురంలో ఓ ముస్లింమత పెద్ద మైనర్ బాలికను గర్భవతి చేసినా ఇంత వరకు చర్యలు తీసుకోలేదన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. వెంటనే దుర్మార్గులపై చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కుల, ప్రజా సంఘాలు కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గోపాల కృష్ణ, రామకృష్ణ, శశికుమార్, నరేంద్ర, రాము, అక్రమ్, బాలు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోండి



ఆర్‌ఐఓ వెంకటరమణ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్న కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆర్‌ఐఓ వెంకటరమణ నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వీరేంద్ర ప్రసాద్, ఉపాధ్యక్షుడు మల్లెల ప్రసాద్ మాట్లాడుతూ.. కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా దోపిడీ చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. మొదటి సంవత్సరం అడ్మిషన్ చేసుకునేటప్పుడు రెండేళ్లకు ఒకే రకమైన ఫీజు ఉంటుందని చెప్పి.. చేరి మొదటి సంవత్సరం అయిపోగానే రెండో సంవత్సరం చదివే విద్యార్థులతో 60 శాతం అదనంగా వసూలు చేస్తున్నారని వాపోయారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బండారు శంకర్, ఉదయ్, ఆనంద్ రాజ్ పాల్గొన్నారు.

అర్హులైన రైతులకు కందుల పంపిణీ



విత్తన కందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కనగానపల్లి: ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం (నేషనల్ ఫార్మ్ సీడ్ మిషనరీ) పథకం కింద రైతులకు వంద శాతం సబ్సిడీపై ఉచితంగా విత్తన కందులు పంపిణీ చేస్తున్నట్లు ఏఓ మాధురి తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద బుధవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి కందుల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో వర్షాధారం కింద కంది సాగు చేసే రైతులకు ప్రభుత్వం ఉచితంగా విత్తన కందులు పంపిణీ చేస్తోందన్నారు. ఇందులో భాగంగా కనగానపల్లి మండలానికి 32 క్వింటాళ్లు కేటాయించడం జరిగిందన్నారు. రైతు సేవా కేంద్రాల వారీగా వాటిని కేటాయించి అర్హులైన రైతులకు అందజేస్తామన్నారు. కంది సాగుచేసే రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చెర్మన్ నెట్టం వెంకటేష్, రాప్తాడు మార్కెట్ యార్డు చైర్మన్ సుధాకర్ నాయుడు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ

అనంతపురం ఎడ్యుకేషన్: మహిళలు చట్టాలపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ కోరారు. బుధవారం స్థానిక ఎస్‌ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో జిల్లా మహిళా శిశు, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'మహిళల సంక్షేమం, భద్రత–సాధికారత' అనే అంశంపై జిల్లా స్థాయి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన రాయపాటి శైలజ మహిళా భద్రతపై ఏర్పాటు చేసిన సంతకాల సేకరణ ఫ్లెక్సీపై సంతకం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాయలసీమ ప్రాంతంలో బాల్య వివాహాలు, గృహహింస, మహిళ ఉద్యోగులపై వేధింపులు, మైనర్ బాలికలపై వేధింపులు తదితర ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. ఏదైనా సమస్య ఎదురైతే మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. యువతులు ఎక్కువగా మోసపూరిత మాటలు నమ్మొద్దన్నారు. సోషల్ మీడియాకు ప్రభావితులై సమస్యలను తెచ్చుకోవద్దని సూచించారు. ఎవరైనా వెంటబడి వేధిస్తే భయపడకుండా హెల్ప్‌లైన్ నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సదస్సులో ఆర్డీఓ కేశవ నాయుడు, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి నాగమణి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి, మాజీ మేయర్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమాకు దరఖాస్తు చేసుకోండి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ కృష్ణ చైతన్య

రాప్తాడు: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంటల బీమా కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కృష్ణ చైతన్య పేర్కొన్నారు. బుధవారం మండలంలో గొందిరెడ్డిపల్లి, బొమ్మేపర్తి గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. రైతులు పంటల బీమాను మూడు రకాలుగా చెల్లించవచ్చని తెలిపారు. బ్యాంకుల్లో రైతులు రుణం రెన్యూవల్ ద్వారా లేదా కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా లేదా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పోర్టల్‌లో పంటల బీమాను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. రైతులు ప్రీమియం చెల్లించేందుకు వెళ్లేటప్పుడు 1బీ, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్, మొబైల్ నంబర్ తీసుకెళ్లాలని సూచించారు. అన్నదాత సుఖీభవకు సంబంధించి అర్హత ఉండి, జాబితాలో అనర్హులుగా వచ్చిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో తిరిగా ఆన్‌లైన్‌లో అర్జీలు పెట్టుకోవాలన్నారు. మండలంలో కౌలు రైతులు ఉంటే కౌలు కార్డులు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు సుజిత, రంజిత, వీహెచ్‌ఏ భాస్కర్, ఎంపీఈఓలు ధనలక్ష్మి, రేష్మ తదితరులు పాల్గొన్నారు.

'అనంత' కళాకారులను ప్రోత్సహించాలి

అనంతపురం కల్చరల్: ప్రతిభ కలిగిన అనంత కళాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో నూతన చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు జిల్లాకు చెందిన నిర్మాత సుజాత అశోక్ బాబు అన్నారు. నేత్ర లక్ష్మి పిక్చర్స్ పతాకంపై నిర్మిస్తున్న నూతన ఓటీటీ సిరీస్ షూటింగ్ బుధవారం నగరంలోని హౌసింగ్ బోర్డు అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రారంభించారు. నిత్యం భార్యాభర్తల మధ్య వచ్చే మనస్పర్థలు గొడవలుగా మారి జీవితాలు నాశనం కాకూడదనే సందేశంతో సిరీస్ చేస్తున్నామని నిర్మాత వెల్లడించారు. రాయలసీమలో వేర్వేరు ప్రదేశాల్లో షూటింగ్ చేస్తామని పేర్కొన్నారు. హైదరాబాద్ యూనిట్ సభ్యులతో పాటూ నగరానికి చెందిన పలువురు టీవీ నటీనటులు షూటింగ్‌లో పాల్గొన్నారు. ప్రణీత్‌సాయి దర్శకత్వంలో వస్తున్న నూతన చిత్రంలో ప్రష్ణు బేబి, ప్రశాంత్, ఝాన్సీ, సీనియర్ రంగస్థల నటులు ఎల్ఐసీ మురళీ, రామగోవిందు, ధరణి తదితరులపై సన్నివేశాలు చిత్రీకరించారు. సుదర్శన్ పర్యవేక్షణలో సాగుతున్న చిత్రానికి పీఎస్‌కే సాయికిరణ్ కెమెరామెన్‌గా సహకారమందిస్తున్నారు.

హనుమాన్ దర్శన్‌కు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

రాయదుర్గంటౌన్: శ్రావణ మాసంలో వ్యాసరాయ ప్రతిష్టిత ఆంజనేయస్వామి దేవాలయాల దర్శనం కోసం రాయదుర్గం డిపో నుంచి హనుమాన్ దర్శన్ పేరిట ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు.డీ హీరేహాళ్ మండలం మురడి ఆంజనేయస్వామి, బొమ్మనహాళ్ మండలం నేమకల్లు ఆంజనేయస్వామి, గుంతకల్లులోని కసాపురం ఆంజనేయస్వామి ఆలయాలను ఒకే రోజు దర్శనం చేసుకునేలా బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి శని, మంగళవారాల్లో బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ నెల 26, 29, ఆగస్టు 2, 5, 9, 12, 16,19 తేదీల్లో రాయదుర్గం డిపో నుంచి ప్రత్యేక హనుమాన్ దర్శన్ బస్సులు బయల్దేరుతాయన్నారు. స్థానిక పాత బస్టాండ్ వద్ద నుంచి ఉదయం 6.30 గంటలకు పై తేదీల్లో మూడు దేవస్థానాల దర్శనం కోసం బయల్దేరుతాయన్నారు. రాయదుర్గం నుంచి రానుపోను పెద్దలకు చార్జీ రూ.350, పిల్లలకు రూ.180 ఉంటుందన్నారు. అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం కోసం 9959225863, 7382862408, 7013463879, 9490414623 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆర్డీటీని కాపాడుకుందాం



ఆర్డీటీకి మద్దతుగా పోస్టుకార్డులను పంపుతున్న విద్యార్థులు

చెన్నేకొత్తపల్లి: ఆర్డీటీ సంస్థకు కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం విద్యార్థులు పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టారు. స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు పెద్ద ఎత్తున పోస్టుకార్డులు రాశారు. ఆర్డీడీని కాపాడుకుందాం అంటూ నినాదాలు చేశారు. ఈ పోస్టుకార్డులను ఢిల్లీకి పంపుతామని తెలిపారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక పాతూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లిష్ అతిథి అధ్యాపక పోస్టుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎం.వెంకటరమణ నాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంఏ ఇంగ్లిష్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 25లోపు బయోడేటాతో నేరుగా కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

జలధికి తరలిన పీర్లు

చెనేకొత్తపల్లి: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో బుధవారం పీర్లు జలధికి తరలివెళ్లాయి. మంగళవారం రాత్రి అగ్నిగుండంలోకి పెద్ద కట్టెలను వేసి వెలిగించారు. తెల్లవారుజామున పీర్లను ఊరేగించారు. బుధవారం సాయంత్రం పీర్లను పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మేళతాళాలు, డప్పుచప్పుళ్ల మధ్య పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. పలువురు భక్తులు పీర్లకు చక్కెర చదివింపులు చేయించారు. ఊరేగింపులో యువత, చిన్నారులు డప్పు వాయిద్యాలకు అలావ్ తొక్కారు. ఆయా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బ్లాక్‌మెయిల్ చేస్తున్న వ్యక్తి అరెస్ట్

అనంతపురం: డబ్బు ఇవ్వాలని బ్లాక్‌మెయిల్ చేస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ ఇన్‌చార్జ్ సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. వివరాలు.. తపోవనంలో శివాలయం గుడి సమీపంలో నివాసం ఉంటున్న సి.వెంకటేష్ కుమారుడు చాగలేటి వంశీకృష్ణ.. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన వర్ధీ నితీష్ కుమార్‌ను బ్లాక్‌మెయిల్ చేసి రూ.లక్ష వసూలు చేశాడు. అడిగిన ప్రతి సారీ డబ్బు ఇవ్వకుంటే స్నేహితురాలితో చనువుగా ఉన్న విషయాన్ని అందరికీ చెబుతాను అంటూ వర్ధీ నితీష్ కుమార్‌ను నిత్యం వేధించేవాడు. మంగళవారం రూ.1,000 డబ్బు పంపాలని చాగలేటి వంశీ కృష్ణ కోరగా.. వర్ధీ నితీష్ కుమార్ పంపాడు. తరచుగా చాగలేటి వంశీ కృష్ణ బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతుండటంతో విసిగిపోయిన వంశీ కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం అనంతపురం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద చాగలేటి వంశీ కృష్ణను అరెస్ట్ చేశారు. అతడి నుంచి రూ.1,000 నగదు, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

స్నానపు గదులు, మరుగుదొడ్ల సమస్య తీర్చండి



వసతి గృహంలో విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీడీఓ బాలక్రిష్ణుడు

చెన్నేకొత్తపల్లి: వసతి గృహంలో తమకు అవసరమైన స్నానాల, మరుగుదొడ్ల గదులు లేవని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర, బాలికల, బీసీ బాలుర వసతి గృహాలను ఎంపీడీఓ బాలకృష్ణుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. బీసీ బాలుర వసతి గృహంలో వంద మంది వరకు విద్యార్థులు ఉన్నామని.. తమకు సరిపడా స్నానాల, మరుగుదొడ్లు సరిపడనన్ని లేవని విద్యార్థులు ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. కొన్ని స్నానాల గదుల్లో నీరు వెళ్లకపోవడంతో మరుగుదొడ్లు బ్లాక్ అయ్యాయని తెలిపారు. చాలా అవస్థలు పడుతున్నామని పేర్కొన్నారు. ఇక్కడ నెలకొన్న సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని ఎంపీడీఓ బాలకృష్ణుడు హామీ ఇచ్చారు. అనంతరం భోజనం నాణ్యతపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వైద్యం కోసం నిరీక్షణ..



ఈసీజీ కోసం కేసు షీట్లను పట్టుకుని నిలబడిన రోగులు



ఓపీ నంబర్–7 గదిని మూసేయడంతో ఆరుబయటే ఉన్న మహిళా రోగులు



అల్ట్రాసౌండ్ ముందు స్ట్రెచర్ కోసం వేచి ఉన్న మహిళ

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రోగులకు సకాలంలో వైద్య సేవలు అందడం లేదు. వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించకపోవడం, స్టాఫ్‌నర్సులను సైతం విభాగాల్లో ఉంచకపోవడంతో రోగులు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. బుధవారం సర్వజనాస్పత్రిలోని ఇంజెక్షన్ గదిలో స్టాఫ్‌నర్సును ఏర్పాటు చేయలేదు. అక్కడ శిక్షణలో ఉన్న నర్సింగ్ విద్యార్థిని ఉంచారు. అదే విధంగా ఈసీజీ కోసం రోగులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. టెక్నీషియన్ రాకపోవడంతో ఈసీజీ గది ముందు నీరసించిపోయారు. ఓపీ నెంబర్ 7 సర్జరీ విభాగంలో వైద్యులు సమయపాలన పాటించలేదు. ఓపీ నెంబర్ 8లో వైద్యులున్నా.. 7లో వైద్యులు లేకపోవడంతో మహిళా రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. ఎంఎన్‌ఓలు అందుబాటులో అల్ట్రాసౌండ్ ముందు ఓ మహిళ ఉండిపోవాల్సి వచ్చింది. సర్వజనాస్పత్రిలో అనునిత్యం ఏదో ఒక సమస్య వెంటాడుతోంది. ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.